క్లుప్తంగా

ఘనంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న సాయిబాబా

ఆనందపురం : మండలంలోని శిర్లపాలెంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయం 13వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు క్షీరాభిషేకం, విశేష అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 15 వందల మందికి అన్నదానం చేశారు. ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోరాడ సత్యారావు, బొప్పడాపు గణేష్, బొప్పడాపు వెంకటరమణ, రమేష్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ అందజేత



చార్చికి వాటర్ కూలర్ అందిస్తున్న మణికంఠ ఫుడ్‌కోర్టు యజమాని సత్యనారాయణ

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయితీ కీతినేపేటలోని పురాతన సెయింట్ పీటర్స్ చర్చికి తగరపువలస మణికంఠ ఫుడ్ కోర్టు యజమానులు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ వాటర్ కూలర్ గురువారం బహుకరించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని రూ.12.800 విలువ చేసే కూలర్‌ను అందించినట్టు చర్చి ప్రతినిధి పెనుమాక జాన్ చార్లీ తెలిపారు.

వారీజా ఆశ్రమంలో ఆయుర్వేద సేవలు



ఆయుర్వేద చికిత్స ప్రారంభిస్తున్న దేవనాథ జీయర్ స్వామి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట శ్రీ చినజీయర్ స్వామి వారీజా ఆశ్రమంలో ఆయుర్వేద చికిత్సాలయాన్ని దేవనాథ జీయర్ స్వామి గురువారం ప్రారంభించారు. అనారోగ్య సమస్యలకు ఆయుర్వేద చికిత్సాలయం సేవలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు శ్రీకాంతాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి మృతి కేసులో లైన్‌మన్ సస్పెన్షన్

ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో విద్యుత్ కార్మికుడు మృతి కేసులో లైన్‌మన్‌ను ఉన్నతాధికారులు గురువారం సస్పెండ్ చేశారు. మండలంలోని చందక గ్రామానికి చెందిన రెడ్డి ఆనందరావు విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మామిడిలోవలో వదులుగా ఉన్న విద్యుత్ వైర్లను స్తంభం ఎక్కి సరిచేస్తున్నాడు. ఆ సమయంలో పని చేస్తున్న స్తంభంపై రెండు లైన్లు ఉండగా ఒక లైనులోనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అదే స్తంభం పైన ఉన్న మరో లైనులో విద్యుత్ ప్రవహిస్తోంది. కాగా కింది లైను వైర్లు సరిచేస్తున్న క్రమంలో పైన ఉన్న లైనులోని వైర్లకు తగలడంతో ఆనందరావు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటనపై విచారణ జరిపిన జోన్ – 3 ఆపరేషన్ డివిజన్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు విధి నిర్వహణలో లైన్‌మన్ అక్కిరెడ్డి అప్పలరాజు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు నిర్ధారించి సస్పెండ్ చేశారు.

సీఎం జగన్ పాలనలోనే మహిళలకు గౌరవం



పట్టాలు తీసుకునేందుకు తరలివచ్చిన లబ్ధిదారులు



మహిళకు ఇంటి పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

- మహిళల పేరిటే ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : చంద్రబాబు హయాంలో మహిళలకు రుణమాఫీ, సున్నా వడ్డీ తదితర హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసగిస్తే... వైఎస్సార్ సీపీ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో మహిళలకు పెద్దపీట వేసి గౌరవ మర్యాదలు పెంచారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 1, 2, 3, 4 వార్డులకు చెందిన మహిళలకు రిజిస్ట్రేషన్ చేసిన 4,184 ఇంటి పట్టాలను భీమిలిలో గురువారం సాయంత్రం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 25 లక్షల మందికి ఇళ్లు ఇచ్చి దేశంలోనే రికార్డు నెలకొల్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ రికార్డు బద్దలుకొట్టి 31 లక్షల మందికి ఇంటి పట్టాలు ఇచ్చి జగనన్న కాలనీలు నిర్మిస్తున్నారని కొనియాడారు. మధురవాడ జోన్‌లో 16 వేలు, పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లో 11 వేలు, సింహాచలం తదితర శివారు ప్రాంతాలను కలుపుకుని నియోజకవర్గంలో మొత్తం 35 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. జిల్లాలో 1.5 లక్షల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. చంద్రబాబు అయిదేళ్ల కాలంలో ఒక్క వ్యక్తికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల అవినీతి, పక్షపాతానికి అంతేలేదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆదాయం తగ్గినా 1,25,000 కోట్లు కుటుంబాల సంక్షేమానికి రూ.3.75 లక్షల కోట్లు సీఎం జగన్ ఖర్చు చేశారని వెల్లడించారు. ఈ అయిదేళ్లలో సామాజిక పింఛన్లకు రూ.83 వేల కోట్లు, విద్యాభివృద్ధికి రూ.72వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు.

రాజధానితో జీవన ప్రమాణాలు పెరుగుదల

రానున్న ఎన్నికల్లో పొరపాటున చంద్రబాబు గెలిస్తే రాజధానిని అమరావతికి తీసుకుపోతాడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటే ప్రమాణ స్వీకారం విశాఖలోనే చేస్తారన్నారు. అప్పుడు భీమిలి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు సమస్య పరిష్కరించి, తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భీమిలి జెడ్సీ కనకమహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, కార్పొరేటర్లు దొలపల్లి ఏడుకొండలు, గంటా అప్పలకొండమ్మ, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, శిల్లా కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, పాల రమణ, బాడితబోయిన రాములప్పడు, జీవీ రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు, పాసి స్వర్ణలత, వాసుపల్లి కొండబాబు, మైలపల్లి లక్ష్మణరావు, జీరు సుజాత, చిల్ల ప్రమీల, గుండాసి మధు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

కొమ్మాది : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పేదలందరి సొంతింటి కల సాకారమైందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు బోరవానిపాలెం పరిధి అంబేడ్కర్ కాలనీలో గురువారం 4,300 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి ప్రాంతంలో ఏకంగా జగనన్న కాలనీలే ఏర్పడుతున్నాయన్నారు. పేదలందరికీ సొంతిళ్లు వుండాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. పార్టీలకు అతీతంగా ఈ పట్టాల పంపిణీ నిర్వహించామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి మేలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరలా గెలిపించాలని కోరారు. ప్రస్తుతం ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న సభల్లో ప్రజలకు ఏమి చేస్తారో చెప్పలేకపోతున్నారని, ప్రభుత్వాన్ని, సీఎం జగన్ మోహన్ రెడ్డిని విమర్శించడమే ఎజెండాగా మారిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతు, నాయకులు జేఎస్ రెడ్డి, మన్యాల సోంబాబు, బోర శ్రీను, బోయి సూరెడ్డి, ముచ్చు రామారావు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

స్మార్ట్ సిటీ స్కూళ్లు ప్రారంభం



తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



స్కూల్ తరగతి గదిలో నాయకులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.5.57 కోట్లతో నిర్మించిన అయిదు స్కూళ్లను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం సాయంత్రం ప్రారంభించారు. వీటికి సంబంధించి భీమిలి – విశాఖ రోడ్డులోని కొండపేట స్కూల్ ఆవరణలో శిలాఫలకాలు ఆవిష్కరించారు. వీటిలో జీవీఎంసీ పండిట్ నెహ్రూ ప్రాథమిక పాఠశాల, సీఎంఈ స్కూల్, కొండపేట ప్రాథమిక పాఠశాల, సంగివలస ప్రాథమిక పాఠశాల, అల్లూరి సీతారామరాజు ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఈ సందర్భంగా ఆటస్థలాలు, పరికరాలు, తరగతి గదులు, ఫర్నీచర్, ప్రహరీ, డిజిటల్ పరికరాలను ఎమ్మెల్యే శ్రీనివాసరావు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో కల్పించిన వసతులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్లు గంటా అప్పలకొండమ్మ, దొలపల్లి ఏడుకొండలు, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, అక్కరమాని రాము నాయుడు, జీరు వెంకటరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, మైలపల్లి లక్ష్మణరావు, ప్రకాశరావు, కోండ్రు రామసూరప్పడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పద్మనాభం : మండలంలోని విలాస్కాన్‌పాలెంలో గల రామలింగేశ్వర ఆలయంలో బుధవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నల్లి సన్యాసప్పడు, బోని అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బోని సన్యాసినాయనుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు



మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 కేంద్రం మధురవాడలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ, కొమ్మాది పరిసర ప్రాంతాల్లో గల పలు పరీక్షా కేంద్రాల వద్ద అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేసి, గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఆయా పరీక్షా కేంద్రాలను పీఎంపాలెం సీఐ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా పత్రాలు తీసుకురావడం, తీసుకెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

గ్రామాల్లో పారా మిలటరీ బలగాల మార్చ్

పద్మనాభం: మండలంలోని ఐదు గ్రామాల్లో గురువారం పారా మిలటరీ బలగాలు 24 మంది, పద్మనాభం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఐదుగురు ఫ్లేగ్ మార్చ్ నిర్వహించారు. రేవిడి, రెడ్డిపల్లి, పద్మనాభం, పొట్నూరు, రౌతులపాలెం గ్రామాల్లో ఈ ఫ్లేగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని బలగాలు భరోసా కల్పించాయి. కార్యక్రమంలో పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

మహా శివరాత్రి పూజలకు ఏర్పాట్లు



మానం ఆంజనేయులు కాలనీలోని మహా కామేశ్వర స్వామి



కారుషెడ్ కూడలిలో ప్రత్యేక అలంకరణలో శివాలయం

మధురవాడ: మహా శివరాత్రి పూజలకు మధురవాడలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం శివరాత్రి సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీల సభ్యులు తెలిపారు. ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 4 గంటలకు విఘ్నేశ్వర పూజ, పంచామృత అభిషేకాలు చేయనున్నారు. సాయంత్రం 7 గంటలకు మహా కామేశ్వర స్వామి లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవార్లకు అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్ చెప్పారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, మధురవాడ జంక్షన్‌లోని సిద్ధేశ్వర స్వామి పీఠంతోపాటు ఇతర ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు చెప్పారు.

పీఎం పాలెం: మహా శివరాత్రిని పురస్కరించుకుని కారుషెడ్ కూడలిలోని శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో మహా దేవునికి ప్రత్యేక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు ప్రదీప్ శర్మ తెలిపారు. పీఎంపాలెం నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరీ శంకర మఠంలోని శ్రీ ఉమా సిద్ధేశ్వర స్వామికి శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం రుద్రహోమం నిర్వహిస్తామని మఠం గౌరవ పరిపాలన ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు.

కూలి రేట్లు పెంచాలని ర్యాలీ

తగరపువలస: కూలి రేట్లు పెంచాలని కోరుతూ సిటు ఆధ్వర్యంలో ముఠా కార్మికులు గురువారం తగరపువలస వీధుల్లో నిరసన ర్యాలీ చేపట్టారు. చిట్టివలస యూనియన్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కూడలి వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడారు. రెండేళ్లకోసారి కూలిరేట్లు పెంచాల్సి వున్నప్పటికీ ఒప్పందం ఇటీవల జనవరితో ముగిసిందన్నారు. దీనిపై నోటీసు ఇచ్చినప్పటికీ వర్తక సంఘం స్పందించకపోవడంతో ర్యాలీ చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికైనా వర్తక సంఘం స్పందించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు. రవ్వ నరసింగరావు, చిల్ల సింహాచలం, ముగడ ఈశ్వరరావు, చిల్ల రాము, కొయ్య ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెయింటాన్స్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

తగరపువలస : భీమిలి సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సిస్టర్ త్రిషా మేరీ మాట్లాడుతూ నూరుశాతం ఉత్తీర్ణతకు విద్యార్థినులు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ క్రిస్టీ జాన్ మాట్లాడుతూ కేవలం చదువులోనే కాకుండా ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న ప్రత్యేకతలు వెలికితీసి ప్రోత్సహించాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా వుంటే అన్నిరంగాల్లో ప్రగతి సాధించగలరన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

బందలో రోడ్డు నిర్మాణంపై నోటీసులు



ఆక్రమణదారునికి నోటీసు అందజేస్తున్న వీఆర్వో నాయుడు

ఆనందపురం : మండలంలోని కుసులువాడలో మొగిద బందలో రోడ్డు నిర్మాణంపై తహసీల్దార్ హేమంత్ కుమార్ గురువారం నోటీసులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుసులువాడ సర్వే నంబరు 106లో 5.16 ఎకరాల్లో మొగిదబంద ఉంది. ఆ భూమి పక్కన గల స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమతులు తీసుకోకుండా లే అవుట్ వేస్తున్నాడు. ఆ లే అవుట్ స్థలానికి రోడ్డు లేకపోవడంతో దాని ముందు ఉన్న మొగిదబందను ఆక్రమించి రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయమై 'దర్జాగా మొగిదబంద కబ్జా' శీర్షికన ఇటీవల సాక్షి పత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు కబ్జా నిజమేనని నిర్ధారించారు. ఆక్రమణలకు పాల్పడిన సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో భూమికి సంబంధించిన ఆధారాలను సమర్పించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హేమంత్ కుమార్ ఆ నోటీసులో హెచ్చరించారు. ఆ నోటీసును ఆక్రమితదారులకు వీఆర్వో నాయుడు గురువారం అందజేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ఆనందపురం : మండలంలోని భీమిలి క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద పోలీసులు జరిపిన తనిఖీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భీమిలి క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వ్యాన్‌లో తరలిస్తున్న బియ్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ఈ మేరకు పోలీసులు ఆరా తీయగా ఆరిలోవలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి పెద్దిపాలెంలో రైసు మిల్లుకు తరలిస్తున్నట్టు నిందితులు అంగీకరించారు. ఈ మేరకు వ్యాన్‌తో సహా 1450 కిలోల బియ్యాన్ని ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, రావాడ గ్రామానికి చెందిన ఒనుము అప్పలరాజు, పైలా వాసును అరెస్ట్ చేశారు. కేసుని ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ



అనిట్స్ కళాశాల రహదారిలో భూమిపూజలో నాయకులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస అనిట్స్ కళాశాల రహదారిలో రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం భూమి పూజ చేశారు. 15 ఏళ్లుగా ఇక్కడ వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి శిల్లా వంశీరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణరావు, కంచుబోయిన వెంకటరావు, జగన్నాథ ఎల్లాజీ, చిల్ల సూర్యనారాయణరెడ్డి, నమ్మి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని, 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి నియోజకవర్గం పరిధి జీవీఎంసీ 98వ వార్డులోని 572 మంది లబ్ధిదారులకు పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలు బాలాజీనగర్‌లోని కల్యాణ మండపంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశ్యమన్నారు. అర్హులైన ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేర్చారన్నారు. ప్రస్తుతం జగనన్న కాలనీలు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయన్నారు. ప్రజా సంక్షేమంతోపాటు, రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ కృషి చేశారన్నారు. దేశంలో రూ.3 వేల పింఛన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. 98వ వార్డులో సంక్షేమ పథకాల కోసం రూ.125 కోట్లు ఖర్చు చేశామన్నారు.

అవినీతికి తావులేకుండా, లంచాలు తీసుకోకుండా, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని రకాల సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, సున్నా వడ్డీకే రుణాలు ఇస్తానని చంద్రబాబు మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకి మహిళలు గుర్తుకు వస్తారని విమర్శించారు. ఐదేళ్ల జగన్ పాలనని... గతంలో చంద్రబాబు పాలనని ప్రజలంతా గమనించాలని కోరారు. టీడీపీ, జనసేన నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మొద్దని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో పేదలకు అడుగడుగునా అన్యాయం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా... ప్రజలకు మంచి జరగాలన్నా మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలన్నారు. ఇళ్ల పట్టాలు మరో నాలుగు వందల మందికి రాలేదని చెబుతున్నారని, వారికీ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్సీ హేమావతి, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నాయకులు పీతల అప్పలరాజు, కర్రి అప్పలస్వామి, నడింపల్లి రామరాజు, లంక సత్తిబాబు, సిరిపురపు కృష్ణ, గంట్ల కిరణ్, తెడ్లపు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించుకోవాలి



హోమియో వైద్యురాలు హరిప్రియతో దాకమర్రి ఎన్ఎస్ఆర్ఐటీ కళాశాల అధ్యాపకులు



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో మహిళలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తగరపువలస : మహిళలను గౌరవించిన చోటే దేవతలు పూజింపబడతారని భీమిలి మండలం దాకమర్రి ఎన్ఎస్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌పి ఖాదర్‌బాబా, హ్యూమానిటీస్ విభాగాధిపతి నాగమణి నాయుడు అన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో ప్రముఖ హోమియో వైద్యురాలు హరిప్రియను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను గౌరవించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మహిళలను, మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.